సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025



అంగన్‌వాడీ టీచర్ల అరెస్ట్

సమస్యల పరిష్కారం కోసం చలో సెక్రటేరియట్‌కు వెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు అరెస్ట్ చేశారు.

- 11లో ▸



దొంగల ముఠాపై పీడీ యాక్ట్

జిల్లాలో దారి దోపిడీలు, చోరీలకు పాల్పడుతున్న పార్థీ ముఠా సభ్యులపై పీడీ యాక్ట్ నమోదు చేశారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.3 /22.6

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'సంఘ్ దేశభక్తిని బోధిస్తుంది'



కామారెడ్డి అర్బన్: సమాజహితంతో ఆరోగ్యకరమైన, సంస్కారవంతులైన దేశభక్తి కలిగిన పౌరులుగా ఉండాలని బోధించేదే రాష్ట్రీయ స్వయం సేవక్ అని సంఘ్ ఇందూర్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ విజయభాస్కర్ కృష్ణశాస్త్రి పేర్కొన్నారు. గురువారం కామారెడ్డి పట్టణంలోని దేవునిపల్లి మల్లన్న కల్యాణ మండపంలో దసరా ఉత్సవం నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరైన విజయ భాస్కర్ కృష్ణశాస్త్రి ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన ఉద్దేశాలు, లక్ష్యాల గురించి వివరించారు. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘచాలక్ బొడ్డు శంకర్, అతిథిగా మీసాల మల్లికార్జున్ మాట్లాడారు. స్వయంసేవక్‌లు సిద్ధిరాములు, శివరాజు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ కళాశాలల్లో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్

కామారెడ్డి టౌన్: అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు ఇంటర్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. ప్రతి కళాశాలలో ఈ మీటింగ్ నిర్వహించాలని, విద్యార్థుల తల్లిదండ్రులు, లెక్చరర్లు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. విద్యార్థుల హాజరు, చదువు, క్రమశిక్షణ, సమస్యలు, సౌకర్యాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించాలని సూచించారు.

రేపు మెగా రక్తదానం శిబిరం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని అడ్వకేట్ సొసైటీ కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీల ఆధ్వర్యంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి నర్సింగ్‌రావు హాజరవుతారని పేర్కొన్నారు. శిబిరంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. వివరాలకు 94401 69128, 78422 55417 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



పెద్ద ఎక్లార సమీపంలో నిండుగా పారుతున్న వాగు

ముసురేసింది!



నిజాంసాగర్ మండలంలో పొంగిపొర్లుతున్న నల్లవాగు మత్తడి

- జిల్లా అంతటా జల్లులు
- అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షం
- మరో రెండురోజులు వర్ష సూచన

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా అంతటా ముసురుపట్టింది. గురువారం ఉదయం నుంచి మొదలైన ముసురు రాత్రి వరకూ కొనసాగింది. కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలో గురువారం నాటి అంగడి (వారసంత)కు ముసురు ఆటంకం కలిగించింది. దసరా, బతుకమ్మ పండగల నేపథ్యంలో చాలా గ్రామాల నుంచి పట్టణానికి వచ్చి షాపింగ్ చేసే ప్రజలు ముసురుతో ఇబ్బందిపడ్డారు.

జిల్లాలో దాదాపు నెల రోజులుగా వర్షం కురుస్తోంది. ఒకటి రెండు రోజులపాటు గెరువివ్వడంతో దుకాణాలు, షాపింగ్ మాల్స్ రద్దీగా కనిపించాయి. పండుగ సీజన్ కావడంతో అందరూ దుస్తులు, ఇతర వస్తువుల కొనుగోళ్లకు కోసం పట్టణాలకు రావడంతో రోడ్లన్నీ బిజీగా కనిపించాయి. కానీ గురువారం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. రోజంతా జల్లులు కురుస్తూనే ఉన్నాయి. జిల్లా అంతటా ఇదే పరిస్థితి ఉంది. మరో రెండు మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనలున్నాయి. రోజూ కురుస్తున్న వర్షాలతో జనం ఇబ్బంది పడుతున్నారు. గత నెల 27, 28, 29 తేదీలలో జిల్లాలో కుంభవృష్టి కురిసింది. దాదాపు జిల్లా అంతటా భారీ వర్షాలు కురిశాయి. వాగులు పొంగి ప్రవహించాయి. పోచారం, నిజాంసాగర్ ప్రాజెక్టులకు రికార్డు స్థాయిలో వరద పోటెత్తింది. పోచారం ప్రాజెక్టు ఒక సందర్భంలో కొట్టుకుపోతుందనే పరిస్థితికి చేరింది. జిల్లాలో చాలా రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. ఇప్పటికీ కొన్ని ప్రాంతాలకు రాకపోకలు పునరుద్ధరించలేదు. కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై లింగంపేట మండలం లింగంపల్లి వద్ద వంతెన దెబ్బతినడంతో ఇప్పటికీ బస్సులు తిరగడం లేదు. జిల్లాలోని చాలా గ్రామాలకు వెళ్లే రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నాయి.

వాగుల్లో పెరిగిన ప్రవాహం

నెల రోజులుగా వాగులు నిరాటంకంగా ప్రవహిస్తున్నాయి. అయితే గురువారం మళ్లీ వర్షం కురవడంతో వాగుల్లో ప్రవాహం పెరిగింది. జిల్లా అంతటా వర్షం పడుతుండడంతో వాగులు, ఒర్రెల్లో ప్రవాహం పెరుగుతోంది. సంగారెడ్డి జిల్లాలో కురుస్తున్న వర్షాలకు నిజాంసాగర్ మండలంలోని నల్లవాగు మత్తడి అలుగుపైనుంచి నీరు ఉధృతంగా పొంగి పొర్లుతోంది. మరో రెండు రోజుల పాటు వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. వానలతో జనం ఇబ్బందులు పడుతున్నారు. బతుకమ్మ పండుగ సమయంలో కురుస్తున్న వర్షాలతో మహిళలు బతుకమ్మ ఆడడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

మద్యం దుకాణాల దరఖాస్తులకు వేళాయె!

- నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో 49 మద్యం దుకాణాలు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : మద్యం దుకాణాల నిర్వహణ కోసం ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. 2025–27 సంవత్సరానికి గాను శుక్రవారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.

జిల్లాలో 49 వైన్‌షాప్‌లు ఉన్నాయి. ఇందులో ఎస్సీలకు ఐదు, ఎస్టీలకు రెండు, గౌడ కులస్తులకు ఏడు కేటాయించారు. మిగిలిన 35 దుకాణాలు జనరల్. గతంలో రూ.2 లక్షలు ఉన్న దరఖాస్తు ఫీజును ప్రభుత్వం ఈసారి రూ.3 లక్షలకు పెంచిన విషయం తెలిసిందే. దరఖాస్తు రుసుమును పెంచినా.. పోటీ తగ్గే అవకాశాలు లేవని భావిస్తున్నారు. మద్యం వ్యాపారం కలిసి రావడంతో ఈసారి మరింతగా పోటీ ఉండే అవకాశం ఉందంటున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం దెబ్బతిన్న నేపథ్యంలో చాలా మంది మద్యం వ్యాపారంవైపు దృష్టి సారించే అవకాశాలు ఉన్నాయి.

అందరిలోనూ ఆసక్తి...

మద్యం దుకాణాల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్ ప్రకటన జారీ కాకముందునుంచే పలువురు ప్రయత్నాలు మొదలుపెట్టారు. చాలా మంది గ్రూపులను తయారు చేసుకున్నారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇతర వ్యాపారాలు చేస్తున్న వారు మద్యం దందాపై ఆసక్తి కనబరుస్తున్నారు. గురువారం నోటిఫికేషన్ వెలువడడంతో మద్యం వ్యాపారులతో పాటు ఇతర రంగాలకు చెందిన వారు దందాలో దిగేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వివిధ వ్యాపారాల్లో భాగస్వాములు, స్నేహితులు.. ఇలా కొందరు కలిసి గ్రూపుగా ఏర్పడుతున్నారు. ఐదు నుంచి పది మంది వరకు కలిసి పది నుంచి ఇరవై దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి రెడీ అవుతున్నారు. కొందరైతే ఇప్పటికే డబ్బులు సర్దుబాటు చేసుకున్నారు. లక్కీ డ్రాలో మద్యం దుకాణం వస్తే రెండేళ్లలో మంచి వ్యాపారం చేసుకునే అవకాశం ఉంటుందన్న భావనతో చాలా మంది మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు రెడీ అవుతున్నారు.

ఏర్పాట్లు చేశాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 49 వైన్‌షాప్‌లకు దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. దీనికి సంబంధించి శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశాం. కలెక్టరేట్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తాం. దుకాణాలకు రిజర్వేషన్ల కోసం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ నేతృత్వంలో లాటరీ నిర్వహించాం. గెజిట్ నోటిఫికేషన్‌లో వివరాలు వెల్లడిస్తాం.

– హన్మంతరావు, జిల్లా ఎక్సైజ్ అధికారి, కామారెడ్డి

రెట్టింపవుతున్న పోటీ...

జిల్లాలో మద్యం వ్యాపారం మీద మోజు పెరుగుతోంది. దరఖాస్తు రుసుము ఎంత పెరుగుతున్నా వెనక్కి తగ్గడం లేదు. రెండేళ్లకోసారి జరుగుతున్న టెండర్లలో రెట్టింపు సంఖ్యలో దరఖాస్తులు రావడమే ఇందుకు నిదర్శనం. 2021లో 49 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించగా.. 960 దరఖాస్తులు వచ్చాయి. తద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి అప్పట్లో రూ. 19.20 కోట్ల ఆదాయం వచ్చింది. 2023లో దరఖాస్తులు 2,175 కి పెరిగాయి. వీటి ద్వారా దాదాపు రూ. 44 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. మద్యం అమ్మకాలు ఏడాదికేడాది పెరుగుతుండడం, వ్యాపారం ఏ ఇబ్బంది లేకుండా ముందుకు సాగుతుండడంతో అందరి కన్ను మద్యం వ్యాపారంపైనే ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలు కూడా ఈ టర్మ్‌లో వచ్చే అవకాశాలున్నాయి. దీంతో వైన్‌షాప్‌లకు ఈసారి తీవ్రమైన పోటీ ఉంటుందని భావిస్తున్నారు. ఈసారి దరఖాస్తులు మూడు వేలు దాటవచ్చని భావిస్తున్నారు. గతంలో దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు ఉండగా.. ఇప్పుడు రూ.3 లక్షలకు పెరిగింది. తద్వారా ప్రభుత్వానికి మరింత ఆదాయం సమకూరే అవకాశాలున్నాయి.



బతుకమ్మ ఆడుతున్న మాజీ ఎమ్మెల్యేలు సత్యవతి రాథోడ్, పద్మ దేవేందర్‌రెడ్డి, సునీత, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్లు ఉమ, శోభ



మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి

రేవంత్ రెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారు

- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- బాన్సువాడలో బతుకమ్మ సంబురాలు



బాన్సువాడలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బాన్సువాడ : తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి బతుకమ్మను తొలగించిన సీఎం రేవంత్‌రెడ్డి పదవికి రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం సాయంత్రం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు వచ్చి వర్షంలో సైతం బతుకమ్మ ఆడారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు పద్మ దేవేందర్‌రెడ్డి, సునీత, టీఎస్‌పీఎస్‌సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ రాజు, తుల ఉమ, బీఆర్‌ఎస్ నాయకులు రాధ, లత, పావని తదితరులు బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ తల్లి పాలు తాగి రొమ్మునే గుద్దిన పెద్ద మనిషి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అని విమర్శించారు. ఆ రావణాసురుడికి అంతం తప్పదన్నారు. మోసం చేసిన వ్యక్తికి శిక్ష తప్పదని, ఆయన రేవంత్‌రెడ్డి కాదని, రైఫిల్‌రెడ్డి అని పేర్కొన్నారు. కేసీఆర్‌ను ప్రజలు మనసులో పెట్టుకున్నారన్నారు. ఆయన మళ్లీ రావాలని ప్రజలు కోరుతున్నారన్నారు.

పోచారం లక్ష్మీపుత్రుడు కాదు..

పోచారం శ్రీనివాస్‌రెడ్డి లక్ష్మీపుత్రుడు కాదని అష్టదరిద్రుడని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. కేసీఆర్ పోచారంను లక్ష్మీపుత్రుడిగా భావించి అభివృద్ధికి నిధులు ఇస్తే.. అధికారం పోగానే పార్టీ మారిన పోచారానికి ఉప ఎన్నికల్లో ప్రజలే బుద్ధిచెబుతారని పేర్కొన్నారు. త్వరలో బాన్సువాడలో ఉప ఎన్నికలు ఖాయమన్నారు. అధికారం లేకున్నా బాన్సువాడలో ఇంత పెద్ద ఎత్తున ప్రజలు స్వాగతం పలకడం ఆడపడుచుల గుండెల్లో కేసీఆర్ ఉన్నారనడానికి సాక్ష్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గంప గోవర్ధన్, హన్మంత్ సింధే, జాజాల సురేందర్, జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ముజీబొద్దీన్, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు అంజిరెడ్డి, జుబేర్, సుశీలరెడ్డి, శ్రీనివాస్‌రావు, గణేష్, చందర్, సాయిబాబా, రమేష్‌యాదవ్, గాండ్ల కృష్ణ, ఉమ మహేష్, శివ, నార్ల రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యపై శిక్షణ



కామారెడ్డి అర్బన్: విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యం పెంపొందించడానికి సదాశివనగర్ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలల విద్యార్థులకు వృత్తి విద్య శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ రాజారెడ్డి, వృత్తి విద్య ట్రైనర్ శ్రీకాంత్ తెలిపారు. దసరా సెలవులలో కామారెడ్డిలోని ప్రైవేట్ సంస్థలో శిక్షణ ఇప్పిస్తున్నామని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం విద్యార్థులు సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు.

మద్యం దుకాణాల రిజర్వేషన్లకు డ్రా

కామారెడ్డి క్రైం: నూతన మద్యం పాలసీ (2025–27)లో భాగంగా జిల్లాలో 49 మద్యం దుకాణాల నిర్వహణకు గురువారం రిజర్వేషన్లు ఖరారు చేశారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో వీడియోగ్రఫీ మధ్య డ్రా తీశారు. జిల్లాలో మొత్తం 49 మద్యం దుకాణాలు ఉండగా వాటిలో ఐదు ఎస్సీ సామాజిక వర్గానికి, రెండు ఎస్టీ సామాజిక వర్గానికి, ఏడు బీసీ గౌడ కులానికి రిజర్వ్ చేశారు. లాటరీ ద్వారా మద్యం దుకాణాలను ఎంపిక చేసి వాటి ఆమోదంకోసం రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్‌కు పంపించామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హన్మంతరావు, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వెంకటేశ్, బీసీ అభివృద్ధి అధికారి జయరాజ్, ఎస్టీ అభివృద్ధి అధికారి సతీశ్, ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



డ్రా తీస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ఆగమాగం.. ఫైళ్లు మాయం

- నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పరిస్థితి
- స్లాట్ సమయం ఉదయం ఉన్నా.. సాయంత్రం వరకు ఆగాల్సిందే..
- మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్న గర్భిణులు, వృద్ధులు



రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గురువారం వేచి ఉన్న జనాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : అది నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయం.. కొత్తవారు ఎవరైనా వస్తే చేపల మార్కెట్టా.. లేక కొత్త సినిమా టిక్కెట్లు బ్లాక్‌లో అమ్ముతున్నారా..? అనే సందేహం కలుగక మానదు. ఇదే తరహా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గురువారం గందరగోళ వాతావరణం నెలకొంది. ఓ తొమ్మిది నెలల నిండు గర్భిణి రిజిస్ట్రేషన్ నిమిత్తం రాగా, ఉదయం 11 గంటలకు స్లాట్ ఇచ్చారు. సాయంత్రం 6.30 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేయలేదు. విచిత్రమేమిటంటే కంప్యూటర్ గదిలో ఎంట్రీ చేసే సిస్టమ్ వద్ద ఉన్న ఫైల్ మాయమైంది. కొన్ని గంటల పాటు వెతకగా చివరకు హాల్‌లో ఉన్న టేబుల్ మీద ఈ ఫైల్ దొరికింది. కార్యాలయంలో ఏ ఫైళ్లు ఎక్కడ ఉన్నాయో అనేది అర్థం కాని పరిస్థితి. నిండు గర్భిణి రిజిస్ట్రేషన్ నిమిత్తం బుధవారం కూడా రోజంతా అనేక ఇబ్బందులు కలిగినప్పటికీ వేచి చూసి వెళ్లారు. ఇలా రిజిస్ట్రేషన్ కోసం రెండ్రోజులుగా తిరుగుతున్నవారు చాలామంది ఉన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల పోటాపోటీ వ్యవహారంలో ఎవరి ఫైళ్లు వారు ముందు పెట్టుకోవాలనే పోట్లాడే పరిస్థితి నెలకొంది. కార్యాలయం మొత్తం డాక్యుమెంట్ రైటర్లదే హవా. దీంతో ఈ కార్యాలయంలో పనిచేసేందుకు సబ్ రిజిస్ట్రార్లు ముందుకు రావడం లేదు. ఏడాది కాలంగా ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు ఇన్‌చార్జి ఇచ్చారు. ఈ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లతో నెట్టుకొస్తున్నారు. అయితే ఇంత గందరగోళ పరిస్థితులు నెలకొన్న రోజు కార్యాలయంలో రిజిస్ట్రార్ ఒక్కరు మాత్రమే విధులు నిర్వహించారు. దీంతో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చినవారు రోజంతా వేచిచూడాల్సిన వచ్చింది. అంతకు ముందురోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వర్ పనిచేయలేదంటూ రిజిస్ట్రేషన్లు పూర్తి చేయలేదు. వందల మందికి ఎదురు చూపులు తప్పలేదు. అయితే నిజామాబాద్ రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మాత్రం సర్వర్ పనిచేయడం గమనార్హం. నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరుగుతున్న వ్యవహారాలకు సంబంధించి తాజా ఘటన ఒక ఉదాహరణ మాత్రమే.

అద్దె భవనంలోనే..

అత్యధిక ఆదాయం తీసుకొచ్చే రిజిస్ట్రేషన్ల విభాగానికి సంబంధించి సొంత కార్యాలయం ఏర్పాటు చేసే విషయంలో ప్రభుత్వం పట్టింపు లేకుండా వ్యవహరిస్తోంది. సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ఏర్పాటు చేసి అందులోకి వివిధ ప్రభుత్వ కార్యాలయాలను తరలించారు. ఇలా తరలివెళ్లిన కార్యాలయాలకు సంబంధించి పలుచోట్ల పాత భవనాలు ఉన్నాయి. అయినప్పటికీ భారీగా అద్దెలు చెల్లిస్తూ తగిన సౌకర్యాలు లేని ప్రైవేటు భవనంలో నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ కార్యాలయాలు నడిపిస్తున్నారు. రెండో ఫ్లోర్‌లో ఉన్న అర్బన్ కార్యాలయానికి వచ్చేందుకు గర్భిణులు, వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుర్చీలు లేక గంటల తరబడి నిలబడుతున్నారు. మరుగుదొడ్లు, నీటి సౌకర్యం కూడా సక్రమంగా లేవని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డిని 'సాక్షి' సంప్రదించగా పరిశీలించి తగిన విధంగా పరిష్కారం చూపేందుకు ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు.

నిబంధనలు పాటిస్తేనే అనుమతులివ్వాలి

- ఆస్పత్రులను తనిఖీ చేయాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: ఆస్పత్రులు, రోగ నిర్ధారణ కేంద్రాలు నిబంధనలు పాటిస్తేనే అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకున్న తర్వాత మాత్రమే కొత్త ఆస్పత్రులు, రోగ నిర్ధారణ కేంద్రాలు నడిపించాలన్నారు. అనుమతి లేని ఆస్పత్రులు, రోగ నిర్ధారణ కేంద్రాలకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. అర్హత లేని వారు వైద్యం చేస్తే సీజ్ చేయాలని ఆదేశించారు. వైద్యశాఖ అధికారులు క్రమం తప్పకుండా ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేయాలని, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్పీ రాజేశ్ చంద్ర, ఏఎస్పీ చైతన్యరెడ్డి, అదనపు కలెక్టర్ విక్టర్, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

మాన్యువల్ విద్యుత్ బిల్లింగ్‌కు స్వస్తి

- జిల్లాలో 'ఏఎంఆర్' విధానం మీటర్ల బిగింపు
- ప్రయోగాత్మకంగా హై వోల్టేజీ విద్యుత్ వినియోగదారులకు ఏర్పాటు

కామారెడ్డి టౌన్: మానవ రహిత ఆటోమేటిక్ మీటర్ రీడింగ్(ఏఎంఆర్) దిశగా టీజీఎన్పీడీసీఎల్ అడుగులు వేస్తోంది. బిల్లుల అందజేతలో వేగం రూపంలో పారదర్శకతను పెంచేందుకు, విద్యుత్ వినియోగదారులకు బిల్లింగ్ సమస్యలు లేకుండా చూసేందుకు ఏఎంఆర్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా కామారెడ్డి జిల్లాలో తొలుత పారిశ్రామిక రంగంలో అధిక హై వోల్టేజీ(హెచ్‌టీ) వినియోగించే పరిశ్రమల్లో వీటిని ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం ఇతర సర్వీసులకు సైతం విస్తరించాలని సంస్థ యోచిస్తుందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు.

కామారెడ్డిలో 366 సర్వీసులు..

కామారెడ్డి జిల్లాలో హై వోల్టేజీ వినియోగించే పరిశ్రమలకు సంబంధించి 366 విద్యుత్ సర్వీసులు న్నాయి. వాటికి 100 శాతం ఏఎంఆర్ ఏర్పాటు లక్ష్యంలో భాగంగా ఇప్పటి వరకు 75 శాతం పూర్తి చేశారు. పరిశ్రమల్లో మీటరు రీడింగ్‌కు హై వోల్టేజీ (హెచ్‌టీ) విద్యుత్తు వాడుకునే కేటగిరీలో 55 హెచ్‌పీకి మించి సామర్థ్యం ఉంటే ఏడీఈ స్థాయి అధికారి, 55 హెచ్‌పీ లోపు ఉంటే ఏఈ స్థాయి అధికారి పర్యవేక్షణ చేస్తారు. నాన్ స్లాబ్ రీడింగ్‌ను లైన్ ఇన్‌స్పెక్టర్లు, స్లాబ్ రీడింగ్‌ను ప్రైవేట్, జూనియర్ లైన్‌మన్లు చూస్తారు. మీటరు రీడింగ్ నమోదులో రోజులు ఆలస్యమైతే స్లాబ్ రేటు మారిపోతుంది. ఈ కారణంగా కరెంటు బిల్లు ఎక్కువగా వస్తోందన్న ఫిర్యాదులు తరచూ వస్తున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు ఏఎంఆర్ పరిష్కారం చూపుతుంది. ఏఎంఆర్ వల్ల తప్పులు జరిగే ప్రసక్తి ఉండదని, విద్యుత్తు సరఫరాలో వచ్చే హెచ్చు తగ్గులు త్వరితగతిన గుర్తించవచ్చని, సిబ్బంది సమయం వృథా కాదని అధికారులు తెలిపారు. ఈ ఏఎంఆర్‌లో 4జీ కమ్యూనికేషన్ సిమ్‌ను అమర్చుతారు. దీంతో నమోదైన డేటా ఎలాంటి మానవ ప్రమేయం లేకుండా వరంగల్‌లోని సెంట్రల్ సర్వర్‌కు చేరుతుంది. సిబ్బంది ఖర్చు లేకుండా 30 రోజుల్లో కచ్చితమైన బిల్లింగ్ పూర్తవుతుంది.




జిల్లాలో బిగించిన ఏఎంఆర్

తప్పలకు ఆస్కారం ఉండదు



జిల్లాలో ఉన్న హెచ్‌టీ మీటర్లకు ఏఎంఆర్‌ను ఏర్పాటు చేస్తున్నాం. దీంతో మానవ రహితంగా బిల్లింగ్ వస్తుంది. తప్పులు జరిగే ఆస్కారం ఉండదు. సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలోని హెచ్‌టీ, పరిశ్రమలకు అన్నింటికి అమర్చుతున్నాం. ఏడీఈ స్థాయి నుంచి లైన్‌మెన్ వరకు వీటిని పర్యవేక్షిస్తాం.

– శ్రవణ్ కుమార్, ఎస్ఈ, కామారెడ్డి

క్లుప్తంగా

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు రాహుల్


సునావత్ రాహుల్

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల డిగ్రీ విద్యార్థి సునావత్ రాహుల్ విశ్వ విద్యాలయాల జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ విజయ్ కుమార్, ఇన్‌చార్జి పీడీ జి.శ్రీనివాస్‌రావులు తెలిపారు. అక్టోబర్ 2 నుంచి కర్నాటక బెల్గాంలో నిర్వహించే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో రాహుల్ పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

పోర్టుపోలియో జడ్జిని కలిసిన న్యాయవాదులు



కామారెడ్డి టౌన్: కామారెడ్డి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం హైదరాబాద్‌లో హైకోర్టు, పోర్టు పోలియో న్యాయమూర్తి నందికొండ నర్సింగ్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేష్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. కామారెడ్డి కోర్టులో ఉన్న సమస్యలు, పలు అంశాలపై చర్చించారు. న్యాయవాదులు జగన్నాథం, వెంకటరామిరెడ్డి, శ్రీధర్, సురేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

రామేశ్వర్‌పల్లి దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడి మృతి


కృష్ణంరాజు (ఫైల్)

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామ దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శివ్వగారి కృష్ణంరాజు (40) గురువారం మృతి చెందారు. ఆయన గత నెలరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందాడు. కృష్ణంరాజు గ్రామ మహిళా సంఘంలో సీఏగా పనిచేశాడు. గ్రామ మహిళా సంఘం అభివృద్ధికి కృషిచేయడంతోపాటు ప్రతి మహిళ ఐకేపీ సంఘంలో చేరేలా విస్తృత ప్రచారం చేశారని పలువురు కొనియాడారు. కృష్ణంరాజు అంత్యక్రియల్లో ప్రజలు, నేతలు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

రెండు రోజులు భారీ వర్షాలు

కామారెడ్డి క్రైం: వాతావరణ శాఖ సూచనల ప్రకారం జిల్లాలో రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. గురువారం ఆయన జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అధికార యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నవ నైవేద్యాల బతుకమ్మ



తొమ్మిదీ రోజులా లక్ష్మివే బతుకమ్మ
దండాలు మాయన్ని నీకివే బతుకమ్మ..
శంకరుని ఇల్లాల బృహదమ్మ నీవేగ
బతుకమ్మ పేరుతో వస్తివే బతుకమ్మ..
ఎంగిలీ పూలతో సంబురం తెస్తివీ
నువ్వులూ, నూకలూ నీకివే బతుకమ్మ..
ఆశ్వయుజ మాసానా అటుకులా వస్తివీ
సప్పిడీ, బెల్లమూ తీపివే బతుకమ్మ..
మూడవా రోజునా మెరిసేటి బొమ్మవే
పాలబువ్వ అందుకునె పాపవే బతుకమ్మ..
నాలుగో రోజునా కమ్మనీ పాయసం
అందించ వస్తిమీ తాగవే బతుకమ్మ..
చప్పట్ల జోరులో పాటలా హోరులో
అట్లనే నైవేద్యం తింటివే బతుకమ్మ..
పంచమీ రోజునా అలిగినా బొడ్డెమ్మ
పస్తుండి నీకన్న ముట్టవే బతుకమ్మ..
నూకలా పిండినీ నేతిలో వేయించి
కమ్మటీ వేప్పల్లు నీకివే బతుకమ్మ..
ఎనిమిదో రోజునా వెన్నముద్దవమ్మా
నువ్వులా లడ్డూలు నీకివే బతుకమ్మ..
తొమ్మిదో రోజునా సద్దులా తల్లివే
బంగారి పూలతో సద్దివే బతుకమ్మ..
గంగమ్మ ఒడిలో సాగిపో హాయిగా
మరుయేడు శిశువులా మారవే బతుకమ్మ..
మరుయేడు శిశువులా మారవే బతుకమ్మ..



డొంకేశ్వర్(ఆర్మూర్):
రాసినవారు: సుజాత శేర్ల
– హిందీ టీచర్, జెడ్పీహెచ్ఎస్, మారంపల్లి (డొంకేశ్వర్)

ప్రకృతి మురిసేలా.. సంస్కృతి, సంప్రదాయానికి అద్దంపట్టేలా బతుకమ్మ పాట రాసే మహిళలకు ఇదే మా ఆహ్వానం. మీ పాటలను పంపాల్సిన వాట్సాప్ నంబర్
8332887332

కమ్యూనిటీ భవన నిర్మాణానికి కృషి

- ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: ఆర్టీసీ విశ్రాంత కార్మికుల కమ్యూనిటీ భవనం నిర్మాణానికి కృషి చేస్తానని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక రెడ్డి సంఘంలో ఆర్టీసీ విశ్రాంత కార్మికుల సంఘంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విశ్రాంత ఆర్టీసీ కార్మికుల సంఘం భవనం కోసం 250 గజాల స్థలంతో పాటు భవన నిర్మాణానికి రూ.10 లక్షలు ఇస్తానని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. విశ్రాంత కార్మికులు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనందం, ఎస్ఎండీసీ మాజీ చీఫ్ జనరల్ పద్మారావు, నేషనల్ ఎజిటేషన్ కమిటీ అధ్యక్షులు లక్ష్మి, బాన్సువాడ విశ్రాంత కార్మికులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఆర్టీసీ కార్మికులు

మహిళలకు అతిపెద్ద పండుగ బతుకమ్మ

కామారెడ్డి క్రైం: బతుకమ్మ పండుగ మహిళా సోదరీమణులకు అతిపెద్ద పండుగ అని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్, ఎస్పీ రాజేష్ చంద్ర, అదనపు ఎస్పీ చైతన్యారెడ్డి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బతుకమ్మ ఆడదానికి మహిళలు ఎంతో ఉత్సాహాన్ని చూపి ఎంతో సంతోషంగా, ఆనందంగా జరుపుకుంటారన్నారు. జిల్లాలో బతుకమ్మ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించాలనే ప్రభుత్వ సూచనల మేరకు ప్రతిరోజు కలెక్టరేట్లో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించడంతోపాటు జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజూ వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో బతుకమ్మ పండుగను నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు, టీఎన్జీవో ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి, కలెక్టరేట్ సిబ్బంది తదితరులున్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

పట్టుబట్టి.. విజయం సాధించి..

- బీసీ సంక్షేమ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూనే గ్రూప్–1కు ఎంపికైన గాయత్రి
- మల్టీజోన్–1లో 201 ర్యాంకు, మహిళా విభాగంలో 4వ ర్యాంకు
- ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగం

కామారెడ్డి టౌన్: మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లికి చెందిన కొండపల్లి గాయత్రి బీసీ సంక్షేమ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తోంది. ఓ వైపు జాబ్ చేస్తూనే గ్రూప్–1కు పట్టుదలతో సన్నద్ధమైంది. ఆమె పట్టుదలకు విజయం వరించింది. గ్రూప్–1కు ఎంపికై ంది. మల్టీజోన్–1లో 201వ ర్యాంకు, మహిళా విభాగంలో 4వ ర్యాంకు సాధించింది. రెండు రోజుల క్రితం టీజీపీఎస్సీ గ్రూప్–1 తుది ఫలితాలు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఉద్యోగానికి ఎంపికైన గాయత్రి మాటల్లోనే...

మా నాన్న సీతారాములు ఆర్టీసీ కండక్టర్, అమ్మ రాజమణి వైద్య ఆరోగ్య శాఖలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. 7వ తరగతి వరకు రామారెడ్డిలో, 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీలో బీఎస్సీ, బీజెడ్సీ జిల్లా కేంద్రంలో చదివాను. ఉస్మానియాలో ఎమ్మెస్సీ, ఎంఎల్ఐఎస్సీ పూర్తి చేశాను. 2020లో గ్రూప్–4కి ఎంపికై కామారెడ్డి బీసీ సంక్షేమ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరాను. డబుల్ పీజీ చదివి జూనియర్ అసిస్టెంట్‌గా ఎందుకమ్మా గ్రూప్–1 ప్రయత్నించి అధికారి కావొచ్చని తోటి ఉద్యోగులు చెప్పడంతో నేను అప్పటి నుంచి తీవ్రంగా ప్రయత్నించాను. గ్రూప్–1 ఉద్యోగం రాదని చాలా మంది ఎగతాళి చేయడంతో నాలో ఇంకా పట్టుదల పెరిగింది. ఎలాంటి శిక్షణ లేకుండానే సొంతంగా ప్రిపేర్ అయ్యాను. ఇటీవల గ్రూప్–1 ఫలితాల్లో సెగ్గాను. ఎక్సైజ్ శాఖలో అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది. విధి నిర్వహణలో కూడా విజయాలు సాధిస్తాను. నిజాయితీగా నిబద్ధతగా విధులు నిర్వహిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంటాను. మా అమ్మ కూడా నన్ను చాలా ప్రోత్సహించింది. ఇంట్లో టీవీ కనెక్షన్ కూడా తొలగించాం. సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేయకుండా చాలా కష్టపడ్డాను. నా కష్టానికి ఫలితం దక్కింది.


కొండపల్లి గాయత్రి

మాదక ద్రవ్యాలను ఆరికట్టాలి

కామారెడ్డి క్రైం: జిల్లాలో మాదక ద్రవ్యాలను ఆరికట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల కారణంగా ఎంతోమంది అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. అసాంఘిక కార్యకలపాలు సైతం చోటు చేసుకుంటున్నాయన్నారు. గంజాయి సాగుపై నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల కారణంగా కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. ఆర్టీసీ బస్సులు, రైళ్లలో తనిఖీలు పెంచాలన్నారు. సమావేశంలో ఎస్పీ రాజేశ్ చంద్ర, ఏఎస్పీ చైతన్యరెడ్డి, అదనపు కలెక్టర్ విక్టర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హన్మంతరావు, డీఈవో రాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉపాధ్యాయుడికి అవార్డు



కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల గణితశాస్త్ర ఉపాధ్యాయుడు విజయగిరి రామకృష్ణకు శారద ఎడ్యుకేషనల్ సొసైటీ నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు అందించింది. గురువారం హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియంలో గల భాస్కర ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఏటా దేశవ్యాప్తంగా అత్యుత్తమ బోధనలు, సృజనాత్మక ఆవిష్కరణలు, విద్యార్థుల అభివృద్ధి కోసం కృషి చేసిన ఉపాధ్యాయులను గుర్తించి ఈ అవార్డు అందిస్తామని శారద ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పట్నం కమలాకర్ తెలిపారు.

కాత్యాయని దేవి అవతారంలో అమ్మవారు


కిచ్చన్నపేటలో కాత్యాయనిదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

సాక్షి నెట్‌వర్క్:దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. నాలుగో రోజు అమ్మవారు కాత్యాయని దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండపాల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు. పలు చోట్ల ప్రత్యేక భజన కార్యక్రమాలు, అన్నదానాలు నిర్వహించారు.

నేడు వెయ్యి మందితో సామూహిక నవదుర్గ వ్రతం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి హౌసింగ్‌బోర్డు కాలనీలోని శారదామాత ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 11 గంటలకు లలితా పంచమి సందర్భంగా వెయ్యి మంది మహిళలతో సామూహిక నవ దుర్గ మహా వ్రతం నిర్వహించనున్నట్లు వేద పండితులు జి.అంజనేయశర్మ తెలిపారు. మహిళా భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



దోమకొండలోని చాముండేశ్వరి ఆలయం వద్ద భజన కార్యక్రమం   లచ్చపేటలో కుంకుమ పూజలు

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో ఒకరు జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. గ్రామానికి చెందిన కుమ్మరి రాజయ్య (55) పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చూయించినా రోగం నయం కావడం లేదు. దీంతో జీవితంపై విరక్తి తో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

● ఎంత పెద్ద వాహనమో..?



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రం మీదుగా జాతీయ రహదారిపై గురువారం భారీ లారీ వెళ్లడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. హైదారాబాద్ నుంచి మద్నూర్ మీదుగా రాజస్తాన్‌కు భారీ ట్రాన్స్‌ఫార్మర్ లోడ్‌తో వెళ్తున్న ఈ లారీకి మొత్తం 146 చక్రాలున్నాయి. రెండు రోజుల క్రితం హైదరాబాద్ నుంచి బయలుదేరామని, మరో నెల రోజుల్లో రాజస్తాన్‌కు చేరుకుంటామని డ్రైవర్లు తెలిపారు.

మద్నూర్ మీదుగా వెళ్తున్న 146 చక్రాల భారీ వాహనం

క్రైం కార్నర్

పేకాడుతున్న 16 మంది అరెస్టు

వర్ని: మోస్రా మండల కేంద్రంలో గురువారం పేకాట స్థావరాలపై స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న 16 మందిని అరెస్టు చేసినట్లు వర్ని ఎస్సై మహేశ్ తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ. 24,230 నగదు, 16 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారన్నారు.

నవీపేటలో ఎనిమిది మంది..

నవీపేట: మండలంలోని నాగేపూర్ శివారులో పేకాట స్థావరంపై బుధవారం రాత్రి దాడి చేసినట్లు ఎస్సై తిరుపతి గురువారం తెలిపారు. పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి రూ.8,430 నగదు స్వాధీనం చేసి, 8 సెల్‌ఫోన్లు, 6 బైక్‌లను సీజ్ చేశామన్నారు. ఎవరైనా పేకాట ఆడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పార్థీ దొంగల ముఠా సభ్యులపై పీడీ యాక్ట్

కామారెడ్డి క్రైం: జాతీయ రహదారులపై దొంగతనాలు, దారి దోపిడీలకు పాల్పడుతున్న పార్థీ దొంగల ముఠాకు చెందిన కొందరిని ఇటీవల కామారెడ్డి పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపిన విషయం తెలిసిందే. ఈ ముఠాలోని ముగ్గురు ప్రధాన నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర గురువారం తెలిపారు. కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్ జిల్లాలలో రహదారుల వెంబడి, దాబా హోటళ్ల వద్ద నిలిపి ఉంచిన వాహనాలను టార్గెట్ చేసుకొని మారణాయుధాలతో దాడులు చేయడం, విలువైన వస్తువులు, నగదు దోచుకోవడం చేస్తుంటారు. అంతేకాకుండా జాతీయ రహదారుల వెంట ఉండే గ్రామాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను దోచేస్తారు. వీరిపై మహారాష్ట్రలోని ఉద్గిరి నీలం పోలీస్ స్టేషన్ల పరిధిలో హత్య, హత్యాయత్నం కేసులు కూడా ఉన్నాయి. ముఠాలోని ప్రధాన నిందితులైన కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా ఔరాద్‌కు చెందిన కృష్ణ బాబు షిండే, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా మంగ్యాల్ తడాకు చెందిన నాందేవ్, వసూర్ గ్రామానికి చెందిన రాథోడ్ అజిత్ రమేశ్‌పై పీడీ యాక్టు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. పీడీ యాక్టు ఉత్తర్వులను నిజామాబాద్ జైలులో ఉన్న నిందితులకు అందజేశామన్నారు.



పార్థీ దొంగల ముఠా సభ్యులకు పీడీ యాక్టు ఉత్తర్వులు అందజేస్తున్న పోలీసులు

కంటైనర్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

■ 9 మందికి గాయాలు



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామం వద్ద 44వ నెంబర్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న కంటైనర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు 27 మంది ప్రయాణికులతో ప్రైవేట్ టావెల్స్ బస్సు బయల్దేరింది. మధ్యప్రదేశ్ నుంచి తమిళనాడుకు వెళుతున్న కంటైనర్‌ను డ్రైవర్ సుద్దపల్లి వద్ద రహదారిపై నిలిపి పక్కనే ఉన్న దుకాణానికి సరుకుల కోసం వెళ్లాడు. అదే సమయంలో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొట్టి అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. దీంతో బస్సులో ఎడమవైపు కూర్చున్న ప్రయాణికులు తొమ్మిది మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఫారుఖ్, రవీందర్, లింగమ్మ, అల్తాఫ్ ఉన్నారు. కంటైనర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.